
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

శనివారం 29 నవంబరు 2025



రిమ్మనగూడ క్లస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎన్నికల విధులపై కలెక్టర్ సమీక్ష

- పారదర్శకత పాటించాలి

గజ్వేల్‌రూరల్/బెజ్జంకి/ములుగు/హుస్నాబాద్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి విస్తృత సమీక్ష నిర్వహించారు. శుక్రవారం ఆమె గజ్వేల్ మండలంలోని రిమ్మనగూడ క్లస్టర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనల అమలులో ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకూడదని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రతి దశను కచ్చితంగా పర్యవేక్షించాలని సూచించారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

కొడకండ్ల, బురుగుపల్లి, చిన్నతిమ్మాయిపల్లి గ్రామాల్లోని నామినేషన్ల కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అభ్యర్థులకు అవసరమైన ఫార్ములపై పూర్తి అవగాహన ఇవ్వాలని, పత్రాలను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతనే స్వీకరించాలని అధికారులకు స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో సెక్షన్ 144 కచ్చితంగా అమలులో ఉంటుందని, అభ్యర్థితో పాటు ఇద్దరికే ప్రవేశ అనుమతి ఇవ్వాలన్నారు.

'ఎస్ఎస్‌టీ' శిబిరాల తనిఖీ

కలెక్టర్ తోటపల్లి శివారులోని (జిల్లా సరిహద్దు), ములుగు మండలం వంటిమామిడి శివారులోని రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వైలెన్స్ టీం(ఎస్ఎస్‌టీ) శిబిరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరాల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రతి ప్రక్రియను విధిగా వీడియో రికార్డు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద ట్రాఫిక్ జామ్ వల్ల ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో విఘాతం చోటుచేసుకోకుండా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సీపీ విజయ్‌కుమార్ సందర్శన

సీపీ విజయ్ కుమార్ శుక్రవారం బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లోని పలు రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. మండలంలోని తోటపల్లి శివారులో (జిల్లా సరిహద్దు) రాజీవ్‌రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ శిబిరాన్ని సందర్శించి రిజిస్టర్‌ను తనిఖీ చేసి సూచనలు చేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీపీ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడే వ్యక్తులను, చెడు ప్రవర్తన కలిగిన వారిని, రౌడీషీటర్ల జాబితాను తయారు చేస్తున్నామన్నారు.

నిఘా నీడలో

- 'స్థానిక' అక్రమాలకు 'చెక్' ● సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులు

- నిరంతర తనిఖీలు
- రూ.50వేల కంటే ఎక్కువ నగదుతో ప్రయాణిస్తే లెక్కచెప్పాల్సిందే

స్థానిక సంస్థల ఎన్నికల పర్వం మొదలవడంతో జిల్లాలో అధికారులు కఠిన నిబంధనలను అమలులోకి తెచ్చారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవడానికి పోలీస్ యంత్రాంగం నిఘాను పటిష్టం చేసింది. జిల్లా నలువైపులా ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహన తనిఖీలను ముమ్మరం చేశారు.

సిద్దిపేట క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి)



ములుగు : మండలంలోని వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో ఓ వ్యక్తి నుంచి రూ.3.20లక్షలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

జిల్లాలో బెజ్జంకి నుంచి ములుగు వరకు 94 కిలోమీటర్ల రాజీవ్ రహదారి ఉంటుంది. ఈ రహదారిపై నిత్యం వ్యాపారవేత్తలు హైదరాబాద్, కరీంనగర్‌కు ప్రయాణిస్తుంటారు. ఎన్నికల నేపథ్యంలో నిత్యం నగదుతో ప్రయాణించే వ్యాపారవేత్తలు, సాధారణ ప్రజలకు ఈ నిబంధనలు కొంత ఇబ్బందిగా మారాయి. ప్రస్తుతం, రూ. 50 వేల కన్నా ఎక్కువ నగదుతో ప్రయాణించేవారు దానికి సంబంధించిన సరైన పత్రాలను (ఖర్చులు, వ్యాపార లావాదేవీల రసీదులు వంటివి) తమ వెంట తప్పకుండా ఉంచుకోవాలి. సరైన పత్రాలు చూపించలేని పక్షంలో ఆ నగదును అధికారులు సీజ్ చేస్తారు.

24 గంటలు నిరంతర నిఘా

జిల్లా వ్యాప్తంగా 26 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను (మండలానికి ఒక అధికారి చొప్పున), ప్రతి చెక్‌పోస్ట్ వద్ద ఒక బృందం చొప్పున 5 స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలను నియమించారు. పోలీసులతో పాటు రెవెన్యూ, ఇతర డివిజన్ స్థాయి అధికారులు ఈ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఓ వ్యక్తి నుంచి రూ.3.20లక్షలు స్వాధీనం

ములుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ రఘుపతి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో తనిఖీ చేయగా ఓ ప్రయాణికుడి వద్ద రూ. 3.20 లక్షల నగదు లభ్యమైంది. సరైన పత్రాలు చూపకపోవడంతో నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్డీవో వద్ద ఆధారాలు చూపితే తిరిగి అందజేస్తామన్నారు.

జిల్లాలోని 5 ప్రధాన చెక్‌పోస్టులు

1. రాజీవ్ రహదారి, తోటపల్లి బెజ్జంకి క్రాస్‌రోడ్
2. భూంపల్లి ఎక్స్‌రోడ్, మెదక్ రోడ్
3. చేర్యాల ముస్త్యాల వద్ద..
4. హుస్నాబాద్ జిల్లాల గడ్డ వద్ద..
5. రాజీవ్ రహదారి, వంటిమామిడి వద్ద..

ప్రతి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలను వీడియోగ్రాఫర్ ద్వారా నిరంతరం రికార్డు చేస్తున్నారు. అధికారులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, ఆ తర్వాత మరో అధికారి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు.



హుస్నాబాద్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ

సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

హుస్నాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుస్నాబాద్ పర్యటన సందర్భంగా పోలీసు కమిషనర్ విజయ్‌కుమార్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని స్థూపం వద్ద మైదానంలో ఏర్పాటు చేసే హెలిప్యాడ్‌ను, బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. సభా వేదిక, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు. సీపీ వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సదానందం, కమిషనర్ మల్లిఖార్జున్, సీఐ శ్రీనివాస్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కొండపాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగం, విధి నిర్వహణలో విధానపరమైన లోపాలు కారణంగా కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వామినాథ్‌రెడ్డిని కలెక్టర్ సస్పెండ్ చేసినట్టు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నిధులను దుర్వినియోగం చేశారని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయగా, గజ్వేల్ డివిజన్ పంచాయతీ అధికారి విచారణ చేపట్టారు. విచారణ నివేదిక ఆధారంగా.. విధుల నిర్వహణలో లోపాలు, అభ్యంతరకరమైన ఖర్చులున్నాయని నిర్ధారించారు. పంచాయతీ కార్యదర్శి సమర్పించిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో, అధికారుల విచారణ ఆధారంగా నిబంధనల ప్రకారం ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు.

ఉద్యమానికి ఊపిరి

- చరిత్రను మలుపు తిప్పిన నవంబరు 29 ● నలుదిక్కులను ఏకం చేసి 11 రోజుల దీక్ష
- నేటితో దీక్షా దివస్‌కు 16 ఏళ్లు పూర్తి



సిద్దిపేటలోని రంగధాంపల్లి దీక్ష వేదిక వద్ద పోలీసులు అరెస్టు చేసేందుకు వస్తుండగా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న హరీశ్‌రావు (ఫైల్)

సిద్దిపేట నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మలిదశ ఉద్యమంలో "తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో" అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2009 నవంబరు 29న సిద్దిపేటలోని రంగధాంపల్లిలో కేసీఆర్ ఆమరణదీక్ష చేయాలని నిర్ణయించడం, ఆ పరిణామాల దృష్ట్యా కరీంనగర్ నుంచి బయలుదేరిన కేసీఆర్‌ను అలుగునూరు వద్ద పోలీసులు అరెస్టు చేసి వరంగల్ మీదుగా ఖమ్మం జైలుకు తరలించారు. అయినప్పటికీ మొక్కవోని సంకల్పంతో కేసీఆర్ ఆమరణ దీక్ష దిగడంతో, తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమకారులు, విద్యార్థులు నిర్వహించిన ఆందోళనలతో రణరంగంగా మారింది. 11 రోజుల పాటు అహింస పద్ధతిలో నిర్వహించిన ఉద్యమానికి ఢిల్లీ తలొగ్గి డిసెంబరు 9న రాష్ట్ర ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభించనున్నట్లుగా ప్రకటించింది. ఈ మేరకు కేసీఆర్ సంకల్పించిన దీక్ష (నవంబరు 29) 16 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దీక్షా దివస్ పేరిట హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నేతలు అట్టహాసంగా కార్యక్రమాలను నిర్వహించనున్నా రు.

తెలంగాణ చరిత్రను మలుపు తిప్పిన రోజు

కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షలో భాగంగా నాడు సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద యుద్ధ వాతావరణం కనిపించింది. ఎటు చూసినా పోలీస్ పికెటింగ్‌లు, ఉద్యమకారుల జై తెలంగాణ నినాదాలు హోరెత్తించాయి. ఆమరణ దీక్ష కోసం బయలు దేరిన క్రమంలో కేసీఆర్‌ను అరెస్ట్ చేసిన విషయాన్ని తెలుసుకున్న హరీశ్‌రావు సూచనతో పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తమయ్యారు. ఉద్యమ స్ఫూర్తిని చాటాలని, ఆ సమయంలో కేసీఆర్ చేపట్టాల్సిన ఆమరణ దీక్ష వేదికలో హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత రామలింగారెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు దీక్షకు పూనుకున్నారు. ఈ క్రమంలో దీక్షా స్థలిని ఖాళీచేయించాలని భావించిన పోలీసులు, వేదికను నలువైపులా చుట్టుముట్టి హరీశ్‌రావుతో సహా ముఖ్య నాయకులందరినీ అరెస్ట్ చేయాలని ముందుకు కదిలారు. అరెస్టు చేస్తే ఆత్మహుతికి పాల్పడుతానని నాడు హరీశ్‌రావు పెట్రోల్ పోసుకోగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన చెందారు. కాగా చివరికి పోలీసులు ఉద్యమకారులను చెదరగొట్టి, లాఠీచార్జీ చేసి హరీశ్‌రావుతో పాటు పలువురిని అరెస్టు చేసి పలు ప్రాంతాలకు తరలించారు.

11 రోజుల పాటు నిరసనల జోరు

నాయకుల అరెస్టు కావడంతో తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. సిద్దిపేట ప్రాంతంలో ఉద్యమకారులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంఘాల నాయకులు 11 రోజుల పాటు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు.

రెండో రోజు 194 నామినేషన్లు

గజ్వేల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ డివిజన్ పరిధిలోని గజ్వేల్, రాయపోల్, జగదేవ్‌పూర్, ములుగు, వర్గల్, మర్కుక్, దౌల్తాబాద్ మండలాల్లోని 163 గ్రామ పంచాయతీలకు రెండో రోజు నామినేషన్లను స్వీకరించారు. ఏడు మండలాల్లోని 163 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు మొదటి రోజు 131 నామినేషన్లు, రెండో రోజు 194 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక 1432 వార్డులకు గాను మొదటి రోజు 75, రెండవ రోజు 445 నామినేషన్లు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. సర్పంచ్ స్థానాలకు 325 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు సభ్యుల స్థానాలకు 520 నామినేషన్లు దాఖలయ్యాయి. దౌల్తాబాద్ మండల పరిధిలోని 25 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు 33, గజ్వేల్ 25 స్థానాలకు 25, జగదేవ్‌పూర్ 25 స్థానాలకు 30, మర్కుక్ 16 స్థానాలకు 12, ములుగు 26 స్థానాలకు 36, రాయపోల్ 19 గ్రామపంచాయతీలకు 27, వర్గల్ 27 స్థానాలకు 31 నామినేషన్లను దాఖలు చేశారు.

దౌల్తాబాద్ 214 వార్డులకు 65, గజ్వేల్ 230 వార్డులకు 43, జగదేవ్‌పూర్ 222 వార్డులకు 58, మర్కుక్ 140 వార్డు స్థానాలకు 72, ములుగు 222 స్థానాలకు 98, రాయపోల్ 166 స్థానాలకు 51, వర్గల్ 238 స్థానాలకు 58 నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల గడువు నేటితో ముగియనుండడంతో భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలున్నాయి. వార్డు సభ్యులు పెద్ద ఎత్తున నామినేషన్లను దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయని, అష్టమి, నవమి అడ్డంకిగా మారడంతో అభ్యర్థులు నామినేషన్లను వేసేందుకు ఆసక్తి చూపనట్లుగా తెలిసింది.



రాయపోల్ : మండలంలోని అనాజీపూర్ క్లస్టర్‌లో నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీతో వస్తున్న అభ్యర్థి

రూ.2వేలతో సర్పంచ్.. రూ.120కే ఉపసర్పంచ్

- నాడు స్వచ్ఛంద మద్దతుతో గెలుపు
- నిస్వార్థ సేవకే గుర్తింపు
- కేవలం మాటపై నమ్మకంతోనే..
- నేడు అవినీతి, ధన ప్రభావం
- నేటి రాజకీయాలపై అనుభవజ్ఞుల ఆందోళన

7

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో వేలం

కొమురవెల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సంవత్సర కాలానికి కొబ్బరికాయలు విక్రయించుకునే లైసెన్స్‌ను చింతల వెంకటేష్ రూ.13,00,000కు హెచ్చు పాడి దక్కించుకున్నారు. అన్నదాన సత్రం ఎదుట ఉన్న శివసదనంలోని షాప్-1కు నెలకు రూ.6,300కు పి.అనిల్, షాప్-2 నెలకు రూ.6,200కు డి.ఏడుకొండలు పాట పాడి దక్కించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

సర్పంచ్‌గా పోటీ.. ఆశావర్కర్ ఉద్యోగానికి రాజీనామా

7

నేడు సీపీతో 'ఫోన్ ఇన్ '

- ఇకపై ప్రతి శనివారం..

8

ఖనిజాల పరిశోధనకు సాంకేతిక సమీక్ష

- డిసెంబర్ 4 నుంచి ఐఐటీహెచ్‌లో సదస్సు

7

పత్తి రైతుకు గుడ్‌న్యూస్!

- దిగుబడి పరిమితి పెంచిన 'సీసీఐ'
- ఇకపై ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు
- ఏఈవో ధ్రువీకరిస్తేనే అదనపు దిగుబడికి అనుమతి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పత్తి రైతులకు ఊరట లభించింది. పత్తి కొనుగోలు విషయంలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులు శుభవార్త చెప్పారు. గతంలో ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సీసీఐ, ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానంలో 7 క్వింటాళ్లకే పరిమితం చేసింది. దీంతో అధిక దిగుబడి వచ్చిన రైతులు ఆందోళన చెందారు. ప్రజాప్రతినిధులు, రైతుల డిమాండ్ మేరకు కేంద్ర ప్రభుత్వం స్పందించింది.

కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

కేంద్రం తాజా నిర్ణయంతో పత్తి కొనుగోలు పరిమితిని తిరిగి ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు పెంచేందుకు సీసీఐ యాప్‌లో అనుమతి లభించింది. అయితే, రైతులు గతంలో మాదిరిగా నేరుగా 12 క్వింటాళ్లు అమ్ముకునేందుకు వీల్లేదు. అధిక దిగుబడి వచ్చిందని ఏఈవో ధ్రువీకరిస్తేనే అదనపు కొనుగోలుకు అవకాశం ఉంటుంది. ఈ సీజన్‌లో జిల్లాలో 1.07 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 12.86 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటివరకు దాదాపు 11 వేల మంది రైతుల నుంచి 1.49 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేశారు.



ఏఈవో ధ్రువీకరణ విధానం ఇలా

ఎకరాకు 12 క్వింటాళ్ల కంటే ఎక్కువ పత్తిని అమ్ముకోవాలనుకునే రైతులు ఈ విధంగా దరఖాస్తు చేసుకోవాలి... రైతులు తమ పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డును జతచేసి ఏఈవోకు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ఏఈవో ఆ రైతు పొలానికి వెళ్లి ఎంత దిగుబడి వచ్చిందో నిర్ధారిస్తారు. అనంతరం కపాస్ కిసాన్ యాప్‌లో ఆ రైతు పేరుతో అదనంగా ఎంత దిగుబడి వచ్చిందో (7 నుంచి 12 క్వింటాళ్లలోపు) నమోదు చేస్తారు. ఆ సమయంలో రైతు ఆధార్‌కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. రైతు ఓటీపీ చెప్పిన తర్వాతే అదనపు దిగుబడి యాప్‌లో అప్‌లోడ్ అవుతుంది. ఆ తర్వాత రైతు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్‌ను బుక్ చేసుకొని తమ పత్తిని అమ్ముకోవచ్చు. రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ అధిక దిగుబడిని ధ్రువీకరించుకునేందుకు ఏఈవోలను ఆశ్రయిస్తున్నారు.

నేటి నుంచి మల్లన్న జాతర

నారాయణఖేడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనంత్‌సాగర్‌లో శనివారం నుంచి సోమవారం వరకు మల్లన్న జాతర మహోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామస్థులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బండ్ల ప్రదక్షిణ, ఆదివారం స్వామి వారి కల్యాణం, మహాప్రసాద వితరణ, బండిషిడీ, బోనాలు, సోమవారం పాచిబండ్ల ప్రదక్షిణ, నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు.

ఎరక్కపోయి వచ్చాను.. ఇరుక్కుపోయాను..!




అల్లాదుర్గంలోని అండర్ బ్రిడ్జిలో ఇర్కుపోయిన ధాన్యం లారీ

- ఎత్తు తక్కువలో అల్లాదుర్గంలోని అండర్ బ్రిడ్జి
- తరచూ ఇరుక్కుపోతున్న వాహనాలు

అల్లాదుర్గం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గంలోని అండర్ బ్రిడ్జి ఎత్తు తక్కువతో నిర్మించడంతో వాహన చోదకులు ఈ బ్రిడ్జి దాటాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. శుక్రవారం అల్లాదుర్గం నుంచి వెళ్తున్న ఓ ధాన్యం లారీ ఈ బ్రిడ్జిలో ఇర్కుపోవడంతో డ్రైవర్ లారీని బయటకు తీసేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నాడని స్థానికులు తెలిపారు. ఎన్నో గ్రామాలకు కూడలిగా ఉన్న అల్లాదుర్గం మండల కేంద్రం మీదుగా నిర్మించిన ఫ్లైఓవర్‌కు సంబంధించి జాతీయ రహదారి అధికారులు ముందు చూపు లేకుండా తక్కువ ఎత్తులో నిర్మించడంతో స్థానికులు అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ అధికారులు ఇవేమి పట్టించుకోకుండా ఇష్టాను సారంగా నిర్మించడంతో నేడు ఈ అండర్ బ్రిడ్జి కింది నుంచి వాహనాలు వెళ్లాలంటే నరకయాతన పడవలసి వస్తుంది.

గత వారం రోజుల క్రితం ఓ చెరుకు లారీ ఇరుక్కుపోవడం, నేడు ధాన్యం లారీ, గతంలో ఓ కంటైనర్ ఇలా పలు వాహనాలు ఈ బ్రిడ్జిలో ఇరుక్కుపోయాయని గ్రామస్థులు చెప్పారు. హైవే అధికారులు ఈ అండర్ బ్రిడ్జి ఎత్తు పెంచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిందితుడి అరెస్టు..

● సొత్తు రికవరీ

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో జరిగిన చోరీని పోలీసులు 48 గంటల్లో చేధించారు. చోరీ చేసిన నిందితుడి నుంచి బంగారు, వెండి అభరణాలు, నగదు రికవరీ చేశారు. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ చింతల్ (గణేశ్‌నగర్)లో నివాసముండే నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంటకు చెందిన కట్ట నవీన్ (26)ను తూప్రాన్ పట్టణంలో నర్సాపూర్ రోడ్డు బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు తెలిపారు. అతడిని అనుమానంతో పట్టుకోగా చోరీ చేసిన వస్తువులు అమ్మకాలు చేసేందుకు నర్సాపూర్ వెళుతున్నట్లు గుర్తించారు. అతడిని విచారించగా తూప్రాన్ పట్టణానికి చెందిన అస్రాఫ్ అలీ ఇంట్లో 25న రాత్రి చోరీ చేసిన 7 తులాల బంగారు అభరణాలు, 37 తులాల వెండి అభరణాలు, రెండు విలువైన వాచ్‌లు, రూ. 20 వేల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు.

ఆత్మహత్యకు ప్రయత్నించిన తల్లీకుమార్తె..

● రక్షించిన పోలీసులు

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన భర్త వేధింపులకు గురిచేయడం. చెరువులో దూకి చనిపోమని తిట్టడం.. ఫంక్షన్‌కు వెళ్లొచ్చిన తల్లీకూతుర్లను ఇంట్లోకి రాకుండా భర్త ఇంటికి తాళం వేసుకోవడంతో మనస్తాపం చెందిన తల్లీకుమార్తెలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చారు. వారిని పోలీసులు రక్షించి కుటుంబీకులకు అప్పగించారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి తూప్రాన్ పెద్ద చెరువు వద్ద చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై-2 యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన లింగ రాణి, లింగ శివశంకర్ దంపతులు పనులు చేసుకొని జీవిస్తున్నారు. శివశంకర్ తాగుడుకు బానిసై భార్య రాణిని వేధింపులకు గురి చేస్తున్నాడు. తాగొచ్చి చెరువులో దూకి చనిపోవాలంటు తిడుతున్నాడు. శుక్రవారం రాణి కూతురు అశ్వినీతో కలిసి ఫంక్షన్‌కు వెళ్లి సాయంత్రం 6గంటలకు ఇంటకి వచ్చింది. ఇంటికి తాళం వేసి ఉండటంతో రాణి భర్త శివశంకర్‌కు ఫోన్ చేయగా, చనిపోమ్మంటూ తిట్టినట్లు చెప్పారు. దాంతో మనస్తాపానికి గురై రాణి, ఆమె కూతురు అశ్వినీ తూప్రాన్ పెద్ద చెరువులో దూకేందుకు వెళ్లారు.



ఆత్మహత్యకు ప్రయత్నించిన తల్లికూతుర్లను రక్షించిన పోలీసులు

ఈ విషయం గుర్తించిన రాణి అత్త 100 డయల్ చేసింది. డ్యూటీలో ఉన్న పోలీసులు రవి, శ్రీకాంత్ పెద్దచెరువు వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకోడానికి చెరువులోకి దిగుతుండగా, రక్షించారు. భర్తను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించినట్లు ఎస్సై యాదగిరి వివరించారు.

గంజాయి కేసులో నిందితులకు జరిమానా, జైలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో నలుగురు నిందితులకు పది సంవత్సరాల జైలు శిక్ష, ఒకరికి ఐదు సంవత్సరాల జైలు, నలుగురికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, ఒకరికి రూ.25 వేలు జరిమానా విధించారు. జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి కె.జయంతి శుక్రవారం తీర్పు చెప్పారు. మెదక్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జె.హరి కిషన్ తెలిపిన వివరాల ప్రకారం... 2021 ఫిబ్రవరి నెలలో జహీరాబాద్‌కు చెందిన నిందితులు రాథోడ్ మోహన్, రాథోడ్ వెంకట్, కేతావత్ పాండు నాయక్, రాథోడ్ మోతీరామ్‌లు 102 కిలోల గంజాయి రవాణా చేస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జహీరాబాద్‌లో పట్టుకున్నారు.

అలాగే ఒడిశా రాష్ట్రం మలల్కానగిరి జిల్లా నలగుంతికి చెందిన సోరాజిత్ బిస్వాస్ (36) ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా 2019 జూన్ 10వ తేదీన సంగారెడ్డి ఎక్సైజ్ పోలీసులు పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద పట్టుకున్నారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్షతో పాటు, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ద్వారకేశ్వరి (ఫైల్)

సంగారెడ్డి క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన సంగారెడ్డిలో శుక్రవారం ఉదయం జరిగింది. సంగారెడ్డి పట్టణ సీఐ పి.రాము నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామానికి చెందిన మొగిలిగారి ద్వారకేశ్వరి (52) మల్కాపూర్‌లో నివాసముంటున్న తన చెల్లెలు దగ్గరకు మూడు రోజుల క్రితం వచ్చింది. పట్టణంలోని గణేష్‌నగర్‌లో ఉంటున్న ఆమె అల్లుడు హరిచరణ్‌రెడ్డి ఇంటికి వెళ్లడానికి శుక్రవారం పట్టణంలోని ధరణి ఆసుపత్రి ఎదుట ఆటో దిగి రోడ్డు దాటుతుండగా పోతిరెడ్డిపల్లి నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న హుండై కారు (నంబరు ఎపి39క్యుడబ్ల్యు 2929) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ద్వారకేశ్వరి అక్కడికక్కడే మృతి చెందింది. అయితే మృతురాలికి వివాహం కాలేదు. మృతురాలి అల్లుడు హరిచరణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాము నాయుడు తెలిపారు.

వడ్లకుప్పను ఢీకొని రైతు..



రవీందర్ రెడ్డి (ఫైల్)

చిన్నకోడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు మండలం గంగాపూర్ శివారులో శుక్రవారం జరిగింది. ఎస్సై సైఫ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తెనుగువానిపల్లికి చెదిన వంచ రవీందర్‌రెడ్డి (45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం రవీందర్ రెడ్డి ఓ పని నిమిత్తం బైక్ పై సిద్దిపేటకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గంగాపూర్ శివారులోకి రాగానే రోడ్డుపై ఆరబోసిన వడ్ల కుప్పకు బైక్ ఢీకొట్టి కిందపడటంతో రవీందర్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం రవీందర్‌రెడ్డి మృత దేహాన్ని ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సుప్రియ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటన పై ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య



తిరుపతి(ఫైల్)

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ మండలం వెంకటాయపల్లికి చెందిన ఉప్పల తిరుపతి (33) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తిరుపతిని ఐకేపీ కేంద్రం వద్ద ఉన్న వడ్ల వద్దకు వెళ్లాలని చెప్పి, భార్య లక్ష్మి కూలీ పనులకు వెళ్లింది. రాత్రి ఇంటికి వచ్చిన భార్య లక్ష్మి తిరుపతి ఉరి వేసుకున్నట్లు గుర్తించి, వెంటనే తూప్రాన్ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు ధ్రువీకరించారు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.



నారాయణఖేడ్ డివిజన్‌లో పెద్ద పంచాయతీ నిజాంపేట.. చిన్నది గుండుతండా

నారాయణఖేడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో 196 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికి, అతి పెద్ద గ్రామ పంచాయతీ మండల కేంద్రమైన నిజాంపేట కాగా, అతి చిన్నది ఖేడ్ మండలంలోని గుండు తండా. గతంలో నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్ మేజర్ గ్రామ పంచాయతీగా ఉండేది. 9 సంవత్సరాల క్రితం మున్సిపాలిటీగా ఏర్పడడంతో నిజాంపేట పెద్ద పంచాయతీగా ఏర్పడింది. నిజాంపేటలో 4,259 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 2033, స్త్రీలు 2226 మంది ఉన్నారు. డివిజన్‌లో చిన్న పంచాయతీగా గుండు తండా ఉంది. మొత్తం 250 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 124, స్త్రీలు 126 మంది.

అప్పీలుకు అవకాశం

మీకు తెలుసా?

తిరస్కరించిన నామినేషన్‌పై ఆర్డీవోకు అభ్యంతర పత్రం దాఖలు చేయొచ్చు

హుస్నాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ తిరస్కరించినట్లయితే అప్పీలుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఆ అభ్యర్థి సంబంధిత ఆర్డీవోకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతర పత్రం సమర్పించవచ్చు. నామినేషన్‌ల దాఖలు ముగిసిన అనంతరం తర్వాత రోజు వాటి పరిశీలన చేపడతారు. ఒకవేళ ఈ పరిశీలనలో నామినేషన్ తిరస్కరణకు గురైనా, మరే ఇతర విషయాలపైన అయినా అభ్యంతరం తెలిపేందుకు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఆ మరుసటి రోజు అవకాశం కల్పించారు. ఈ అప్పీల్‌పై ఆతరువాత రోజు అధికారులు పరిష్కారం వెల్లడిస్తారు.





సమానంగా ఓట్లు.. టాస్‌తో గెలుపు

కల్హేర్ మండలంలోని జంలా తండాలో 2019లో సర్పంచ్‌గా బలరామ్

కల్హేర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులకు సమానంగా ఓట్లు వేసి విచిత్రమైన తీర్పు ఇచ్చారు కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట్ జంలా తండా ఓటర్లు. బీబీపేట పంచాయతీలో ఉన్న తుకారాం తండా, జంలా తండాను కలిపి 2019 నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ కాగా, నాటి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో దేవసోత్ బలరామ్, కాంగ్రెస్ మద్దతుతో కడావత్ మంగిళిబాయి పోటీ చేశారు. రెండు తండాల్లో కలిపి 600 ఓటర్లు ఉండగా, హోరాహోరీ పోరు జరిగింది. తీరా ఓట్లు లెక్కింపు పూర్తి కాగానే పోలైన ఓట్లలో బలరామ్‌కు 286, మంగిళిబాయికి 286 సరిసమానంగా వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు ఇద్దరు అభ్యర్థుల సమ్మతితో టాస్ వేసి విజేతను ఎంపిక చేయడానికి నిర్ణయించారు. టాస్ వేయగా సర్పంచ్ పదవి బలరామ్‌కు వరించింది. మంగిళిబాయి నిరాశతో నిష్క్రమించారు. సమానంగా ఓట్లు రావడంతో ఇద్దరు సర్పంచులుగా అర్హత సాధించినట్లేనని మంగిళిబాయిని ఎన్నికల అధికారులు, నాయకులు ఓదార్చారు. ప్రస్తుతం మంగిళిబాయి భౌతికంగా లేరు. ఆమె రెండేళ్ల సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించారు.



టాస్‌తో సర్పంచ్‌గా ఎన్నికైన దేవసోత్ బలరామ్, సమానంగా ఓట్లు సాధించిన మంగిళిబాయి

స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాలి

● యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి పిలుపు



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి

మెదక్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థుల గెలుపు కోసం యువజన కాంగ్రెస్ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని తెలంగాణ భవన్‌లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురాంగౌడ్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని, అందులో భాగంగానే రాష్ట్రంలో 8 మంది యువజన కాంగ్రెస్ నేతలను డీసీసీ అధ్యక్షులుగా నియమించారని తెలిపారు. అదే విధంగా ఒక ఎమ్మెల్సీ, ఒక రాజ్యసభ ఎంపీ పదవిని ఇచ్చారని వివరించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవి దక్కిందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి భవ్యసింగ్ మాట్లాడుతూ సాధారణ మహిళ అయిన తనకు జాతీయ స్థాయిలో అవకాశం కల్పించిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీదేనన్నారు. జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంపైన దృష్టి పెట్టాలని శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు మహేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు తరుణ్, రాంచెంద్రారెడ్డి, మెదక్ అసెంబ్లీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, నర్సాపూర్ అధ్యక్షుడు సందీప్, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి యువజన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

రూ.2000తో సర్పంచ్.. రూ.120కే ఉపసర్పంచ్

నేడు అవినీతి, ధన ప్రభావం

నేటి రాజకీయాలపై అనుభవజ్ఞుల ఆందోళన


కొండపాక/సదాశివపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సేవ, నిబద్ధత ప్రధానంగా సాగిన మూడు దశాబ్దాల నాటి స్థానిక సంస్థల రాజకీయాలు ప్రస్తుత ధన, అధికార రాజకీయాల మధ్య ఎంతటి మార్పు వచ్చిందో ఇద్దరు సీనియర్ నాయకుల అనుభవాలు కళ్లకు కడుతున్నాయి. కేవలం మాటపై నమ్మకంతో, స్వచ్ఛంద మద్దతుతో నామమాత్రపు ఖర్చుతో ఎన్నికల్లో గెలిచి, గ్రామ అభివృద్ధికి కృషి చేసిన అప్పటి పరిస్థితులు నేడు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు డబ్బున్న వాడిదే రాజ్యం అన్నట్టుగా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టి పదవులు చేజిక్కించుకుంటూ, అవినీతికి పాల్పడుతున్న తీరుపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నిమ్మ దుర్గారెడ్డి

స్వచ్ఛంద మద్దతుతో రాజకీయ రంగ ప్రవేశం

సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన నిమ్మ దుర్గారెడ్డి 1988లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పాత తరం, సుమారు 18 సంవత్సరాలు గ్రామాన్ని ఏలిన నాయకుడిపై పోటీ చేసి గెలుపొందారు. ఆ రోజుల్లో దశాబ్దాల కాలం పాటు గ్రామాలను ఏలుతున్న పాత తరం నాయకులపై పోటీ చేయాలంటేనే భయపడే వారు. అయితే, యువకులంతా కలిసి స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడంతో దుర్గారెడ్డి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆనాటి రోజుల్లో గ్రామస్థుల నమ్మకంతో రూ.2000 లోపే ఎన్నికల ఖర్చుతోనే ఆయన విజయం సాధించారు. అప్పుడు మాటమీద కట్టుబడి, నమ్మకంతో ఉండేవారని, కానీ ప్రస్తుతం అవినీతి డబ్బు ప్రభావం పెరిగిందని, డబ్బు పంచేసి పదవిలోకి రావాలని చూస్తున్నారని ఆయన వాపోయారు. గ్రామం కోసం, అభివృద్ధి కోసం ఆస్తులు పోగొట్టుకునేవారని, ప్రస్తుతం పదవిని సంపాదించడం కోసం రాజకీయాల్లోకి వస్తున్నారని, అంతా డబ్బుతోనే ముడిపడి ఉందని ఆయన ప్రస్తుత పరిస్థితులను వివరించారు.



ప్రజాసేవతో ఏకగ్రీవంగా సర్పంచ్

సంగారెడ్డి జిల్లా, సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన గడీల రాంరెడ్డి కూడా నాటి నిస్వార్థ రాజకీయాలకు నిదర్శనంగా నిలిచారు. 1995లో కేవలం రూ.120 ఖర్చుతో వార్డు సభ్యునిగా గెలుపొంది, ఆ తరువాత ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2001లో రూ.500 ఖర్చుతో రెండోసారి ఉపసర్పంచ్‌గా గెలిచారు. నిస్వార్థ ప్రజాసేవ, గ్రామ అభివృద్ధి కోసం రాంరెడ్డి చేసిన కృషిని గుర్తించిన గ్రామ ప్రజలు, 2006లో ఆయనను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా కంబాలపల్లి గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి, ఆ గ్రామం అప్పట్లో నిర్మల్ గ్రామ పురస్కారానికి ఎంపిక కావడంలో ఆయన కృషి ఎంతో ఉంది. 2011 నుంచి 2019 వరకు మండల కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేసిన రాంరెడ్డి, తన నిస్వార్థ సేవను కొనసాగించారు. వార్డు మెంబర్, ఉపసర్పంచ్, సర్పంచ్ పదవుల్లో ప్రజల మెప్పు పొందిన ఆయన 2019 ఎన్నికల్లో తన సతీమణి గడీల శ్రీదేవిని సదాశివపేట జడ్పీటీసీగా గెలిపించారు. ప్రస్తుతం ఆయన సంగారెడ్డి జిల్లా సీడీసీ చైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ప్రజలకు చేసిన సేవలే తనను ఈ స్థాయికి తీసుకువచ్చాయని ఆయన పేర్కొన్నారు.



గడీల రాంరెడ్డి



గడీల శ్రీదేవి

నాడు స్వచ్ఛంద మద్దతుతో గెలుపు

నిస్వార్థ సేవకే గుర్తింపు

ఎన్నాళ్లిలా.. నామినేషన్‌కు వెళ్లేది ఎలా?



గేటు మూసివేసిన రైల్వే అధికారులు

కోహీర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని రాజనెల్లి-పీచేర్యాగడి గ్రామాల మధ్య నెల రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామ సమీపంలోని 26వ రైల్వే గేటును మూసివేసి ఆ ప్రాంతంలో అండర్ రైల్వే బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం అందులో భారీగా వర్షం నీరు ఉండడంతో రాజనెల్లి-పీచేర్యాగడి గ్రామాల మధ్య రాకపోకలు కొనసాగడం లేదు. అయితే, పంచాయతీ ఎన్నికల దృష్ట్యా నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పీచేర్యాగడిలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేశారు. అయితే రాజనెల్లి, గురుజువాడ, మద్రి గ్రామాలకు చెందిన సర్పంచు, వార్డు సభ్యుల అభ్యర్థులు ఈ దారి గుండా వెళ్లి నామినేషన్లు దాఖలు చేసేందుకు వీలు లేదు. అండర్ బ్రిడ్జిలో వర్షం నీరు నిలిచి ఉండడంతో దగ్గరలోనే ఉన్న పీచేర్యాగడికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.



కాలువను తలపిస్తున్న రాజనెల్లి-పీచేర్యాగడి గ్రామాల మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి

సర్పంచ్‌గా పోటీ..ఆశావర్కర్ ఉద్యోగానికి రాజీనామా

రాయపోల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు ఓ ఆశావర్కర్ తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ అయింది. దీంతో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్న ఆ గ్రామానికి చెందిన ఆశావర్కర్ రాజగారి రేణుక తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఆమె రాజీనామాను ఆమోదించి ఉన్నతాధికారులకు పంపించినట్లు ఇందుప్రియాల్ వైద్యాధికారి అశ్లేష తెలిపారు.

మహిళా విద్యకు మార్గదర్శకుడు ఫూలే

● నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : మహిళా విద్యకు మార్గదర్శకుడు పూలే అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం చిట్కుల్‌లోని నీలం ముదిరాజ్ నివాసంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం కృషి చేసిన గొప్ప మహనీయుడు పూలే అన్నారు. మహిళా విద్య, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం పూలే దంపతులు స్థాపించిన సత్యశోధక్ సమాజ్ వల్ల సమాజంలో ఉన్న అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు కారణమైంది అన్నారు. ఆయన చూపిన బాట సమాజానికి అనుసరణీయం అని నీలం మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజ్జు, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్

ఖనిజాల పరిశోధనకు సాంకేతిక సమీక్ష

డిసెంబర్ 4 నుంచి ఐఐటీహెచ్‌లో అంతర్జాతీయ సదస్సు

దేశ, విదేశాల నుంచి ప్రఖ్యాత పరిశ్రమలు, పరిశోధనా సంస్థల రాక

కంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచవ్యాప్తంగా క్లిష్టమైన ఖనిజాలను వెలికి తీసేందుకు డిసెంబరు 4 నుంచి 6 వరకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఐఐటీహెచ్ అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. దేశంతో పాటు విదేశాల నుంచి ఆహ్వానించబడిన 24 మంది వక్తలు శక్తి పరివర్తనకు సంబంధించిన అధునాతన పదార్థాలు, క్లిష్టమైన ఖనిజాలపై తమ అత్యాధునిక పరిశోధనలను ప్రదర్శిస్తారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ విభాగం ఆధ్వర్యంలో 1400 సాంకేతిక సారాంశాలలో 60 మందితో కూడిన సాంకేతిక సమీక్ష కమిటీలు జరగనున్నాయి. అంతేగాక అత్యుత్తమ నిపుణులు 14 సమాంతర సెషన్లలో 409 మౌఖిక ప్రదర్శనలు 750 పోస్టర్ ప్రజెంటేషన్ల కోసం సారాంశాలను సిఫార్సు చేశారు. జపాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ అండ్ మెటీరియల్స్ సహకారంతో రెండు ప్రత్యేక సెషన్లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతలను ప్రదర్శించే 40 మందితో లోహ శాస్త్రం, మెటీరియల్స్ ఇంజనీరింగ్‌లో ప్రస్తుత పోకడలు, వ్యూహాత్మక దిశలపై నిపుణులు ప్రసంగించనున్నారు. ప్రముఖ లోహశాస్త్ర నిపుణులు, పరిశోధకుల ప్రదర్శనల ద్వారా బలమైన పరిశ్రమ విద్యా భాగస్వామ్యాలను ఐఐటీహెచ్ పెంపొందిస్తుందని తెలిపారు. ఈ సమావేశం మెటీరియల్స్ మెటలర్జికల్ ఇంజనీరింగ్ రంగానికి ఒక మైలురాయి అవుతుందని ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.



అంతర్జాతీయ సదస్సు వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఐఐటీహెచ్ అధికారులు

సంగీత, నృత్య, నాటక పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైన మర్పల్లి పాఠశాల ఉపాధ్యాయుడు

రేగోడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ వారు నిర్వహించిన అఖిల భారత సివిల్ సర్వీస్ సంగీత, నృత్య, నాటక పోటీల్లో రేగోడు మండలానికి చెందిన టీచర్ ఎంపికయ్యాడు. మండలంలోని మర్పల్లి పాఠశాలలోని ఉపాధ్యాయుడు ఆదిత్యగౌడ్ సంగీతం విభాగంలో ప్రతిభ కనబరిచగా జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆయనను ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్, మండల అధ్యక్షుడు సందీప్, ప్రధానకార్యదర్శి నరేష్ అభినందించారు.



ఉపాధ్యాయుడు ఆదిత్యగౌడ్

పది విద్యార్థులకు అల్పాహారం ఏది?

రామచంద్రాపురం టౌన్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందించేటట్టు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి కోరారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారని వివరించారు. ఎక్కువగా నిరుపేదలు చదువుతుంటారని తెలిపారు. వారికి నిత్యం పౌష్టికాహారం అందించినప్పుడే పరీక్షల్లో రాణించగలుగుతారని వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బడిలోనే సమయాన్ని గడిపినందున సహజంగానే ఆకలి వేస్తుంటుందని తెలిపారు. అటువంటి సందర్భాలను గుర్తించి విద్యార్థులకు అల్పాహారం అందించాలని కోరారు. సాయంత్రం సమయంలో పది పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. ప్రత్యేకంగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టి ఆసక్తి పెంచేటట్టు పాఠ్యబోధన జరపాలని తెలిపారు. పదో తరగతి విషయంలో విద్యార్థులకు సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత గంట సమయం, ఉదయం బడి ప్రారంభం కాకముందు గంట సమయం చొప్పున అదనపు బోధన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయా సమయాల్లో కావాల్సిన అల్పాహారం అందించగలిగితే నిరుపేద విద్యార్థుల్లో చదువుకోవాలన్న ఆసక్తి పెరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రెండో రోజు హోరాహోరీగా క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ మ్యాచ్‌లు రెండో రోజు కొనసాగాయి. శుక్రవారం కొండాపూర్ మండలం కోనాపూర్ ఎంఏ క్రికెట్ గ్రౌండ్స్‌లో గ్రీన్ జట్టు, బ్లూ జట్టు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన బ్లూ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గ్రీన్ జట్టు 33.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసి విజయం సాధించింది. అదే విధంగా రెండో మ్యాచ్ పీబీఆర్ సింగాపురం గ్రౌండ్స్‌లో ఎల్లో, రెడ్ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన రెడ్ జట్టు 45.3 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ దిగిన ఎల్లో జట్టు 38 ఓవర్లలో 180 పరుగులు చేసి ఆలౌట్ కాగా, రెడ్ జట్టు విజయం సాధించింది.



అండర్-14 లీగ్‌లో విజయం సాధించిన రెడ్ జట్టు

చేర్యాలలో స్థానిక జోష్

● సర్పంచ్ అభ్యర్థుల వెల్లడితో బీఆర్ఎస్‌లో దూకుడు


కమలాయపల్లిలో సర్పంచు అభ్యర్థులను వెల్లడిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం

చేర్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జనగామ బీఆర్ఎస్‌లో జోష్ నెలకొంది. పార్టీ గుర్తుతో ఎలాంటి సంబంధం లేకున్నప్పటికీ మెజారిటీ సర్పంచులను చేజిక్కించుకుని పట్టు నిలుపుకుని ఆధిపత్యం కొనసాగించాలని ఉవ్విళ్లూరు తుంది.

ఎమ్మెల్యే స్పెషల్ ఫోకస్

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టి పార్టీశ్రేణులను సమాయత్తం చేశారు. రిజర్వేషన్ల ప్రకటనకు ముందు కొద్దిరోజులక్రితం ఏయే గ్రామాల్లో ఎవరెవరు బరిలో నిలుస్తారని ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అంతకుముందే తనకు సన్నిహితంగా మెదులుతున్న వారు, పార్టీ శ్రేణుల్లో పలువురితో పాటు ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రత్యర్థుల పట్ల సర్వే కూడా చేయించడం గమనార్హం. పార్టీ నుంచి బరిలో నిలిచే ఆశావహుల సంఖ్య అధికంగా ఉండటంతో ప్రస్తుత రాజకీయ పరిణామాలు బేరీజు వేసుకుంటూ గెలుపు గుర్రాల కోసం పావులు కదుపుతున్నారు. గ్రామాల్లో పర్యటించి పార్టీ శ్రేణులతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ అభ్యర్థుల ఎంపికపై ఆచి తూచి అడుగులు వేస్తూ సాధారణ ఎన్నికల మాదిరిగా పార్టీలో వాతావరణాన్ని కల్పించారు. దీంతో పలువురు సంసిద్ధమై అప్పుడే ప్రచార సరళి కొనసాగిస్తున్నారు.

ఎంపికలో నూతన ఒరవడి

ఆశావహులు అధికసంఖ్యలో ఉండటంతో స్థానిక బలం, బలగం, ఆధారంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సర్పంచు అభ్యర్థుల వెల్లడితో నూతన ఒరవడికి తెరలేపారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని ఆయా గ్రామాలకు సంబంధించి మూడో విడతలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. గ్రామాలవారీగా పలువురు బాధ్యులను నియమించి అభ్యర్థులను ఎంపికలో దూకుడు ప్రదర్శిస్తున్నారు.

పలు గ్రామాల్లో అభ్యర్థుల వెల్లడి

చేర్యాల మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మాజీ వైస్ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి తదితరులతో కూడిన బృందం పర్యటించి పార్టీ శ్రేణుల సమక్షంలో అభ్యర్థులను వెల్లడించారు. చేర్యాల మండలం తాడూరులో నర్ర ఉపేందర్‌రెడ్డి, చిట్యాలలో వంకాయల రమణ, దానంపల్లిలో రాచకొండకనకయ్య, కమలాయపల్లిలో బొట్టు పద్మను బరిలో నిలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ దూకుడు ప్రదర్శిస్తుండగా, ప్రత్యర్థి పార్టీలు ఆలోచనలో పడిపోయాయి. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న క్రమంలో విలక్షణ తీర్పుకట్టబెట్టే చేర్యాల ప్రాంత ఓటర్లు ఎవరికి పట్టం కట్టనున్నారో వేచిచూడాల్సిందే మరి.

సంక్షిప్తం

నేడు సీపీతో ఫోన్ ఇన్

● ఇకపై ప్రతీ వారం..

సిద్దిపేట క్రైం నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈ నెల 29న పోలీస్ కమిషనర్‌తో ఫోన్-ఇన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఉదయం 11 నుంచి 12 గంటల లోపు 8712667407, 8712667306, 8712667371 నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా విన్నవించుకోవచ్చు. ఇకపై ప్రతీ శనివారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీ విజయ్ కుమార్ తెలిపారు. ప్రజలు, పోలీసుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని, పౌరులు నిర్భయంగా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నేర రహిత సమాజం కోసం పౌరులందరూ సహకరించాలని కోరారు.

జనగామ డీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్‌గా ఎడెల్లి సంతోష్


టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో నియామకపత్రం అందుకుంటున్న సంతోష్

చేర్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జనగామ డీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్‌గా పట్టణంలోని అక్షర హాస్పిటల్ నిర్వాహకుడు ఎడెల్లి సంతోశ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

గీతన్నల రణభేరికి తరలిన గీత కార్మికులు

హుస్నాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూర్యపేటలో శుక్రవారం జరిగిన గీతన్నల రణభేరికి హుస్నాబాద్ పట్టణం నుంచి గీత కార్మికులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నందుకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కల్లు గీత కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఇందులో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొయ్యడ కొంరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, నర్సాగౌడ్, రవీందర్, మహేశ్ తదితరులున్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు

సిద్దిపేట రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఇర్కోడు తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం విభాగంలో విద్యార్థులు ఉదయ్, మైఖేల్, త్రినేత్ర ఉత్తమ ప్రతిభకనబరిచి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీల్లో 14 మోడల్ స్కూళ్లు, 26 కేజీబీవీ, 12 గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నీరేష్

మద్దూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ నీరేష్ పేర్కొన్నారు. మద్దూరు మండల కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం ఆయన బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో, వరదరాజులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకోవాలి



నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్, మద్దూరు మండలం రేబర్తి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

సిద్దిపేట రూరల్/ములుగు/మద్దూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రశాత వాతావరణంలో ఎన్నికలు జరుపుకునేందుకు ప్రజలంతా సహకరించాలని నారాయణరావుపేట, ములుగు, మద్దూరు మండలాల ఎంపీడీవోలు శ్రీనివాస్‌రెడ్డి, స్వర్ణకుమారి, ఎస్.రాంమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం వారు ఆయా మండలాల్లో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో సదుపాయాలు ఉన్నాయా.. లేవా అని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. నామినేషన్ పత్రాలను సరిగ్గా పరిశీలించాలన్నారు. కాగా నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జింక జయంత్, రూరల్ ఎస్ఐ రాజేష్‌తో కలిసి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు.

ములుగు మండల పరిధిలోని ములుగు, చిన్న తిమ్మాయపల్లి, సింగన్నగూడ, కొత్తూరు, బైలంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఎంపీడీవో స్వర్ణకుమారి పరిశీలించారు. వెంట పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, రహీం, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సంతోష్‌రెడ్డితో పాటు తదితరులున్నారు. మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో పోలింగ్ స్టేషన్లను ఎంపీడీవో ఎస్.రాంమోహన్ సందర్శించారు. వెంట ఎంఈవో వరదరాజులు, హెచ్ఎం, సెక్రటరీ మాధవ్ జాదవ్ ఉన్నారు.

నామినేషన్లను అడ్డుకోవడం చట్టరీత్యా నేరం


పలుగుగడ్డ గ్రామంలో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో డబ్బు ఆశ చూపి, ప్రలోభాలు, బెదిరింపులకు గురిచేసి ఇతరులను నామినేషన్‌లు వెయ్యకుండా అడ్డుకోవడం చట్ట ప్రకారం నేరమని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ నిర్మల పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్, మాందాపూర్, పలుగుగడ్డ, బిజీవెంకటాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో వారు పర్యటించి సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు పాటించవలసిన నిబంధనల గురించి గ్రామస్థులకు వివరించారు. గ్రామాల్లో ఏమైనా ఫిర్యాదులు ఉంటే నేరుగా కానీ, టీపోల్ యాప్ ద్వారా కానీ ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

బీజేపీ సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే రూ. 10 లక్షలు

హుస్నాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ గ్రామాభివృద్ధికి మంత్రి బండి సంజయ్ రూ. 10 లక్షలు మంజూరు చేయిస్తారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లో జరిగిన బీజేపీ అభ్యర్థుల ఎన్నికల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, లక్కిరెడ్డి తిరుమల, మండల అధ్యక్షులు సంపత్ నాయక్, రాజేంద్రప్రసాద్, సతీష్, కుంట మల్లయ్య పాల్గొన్నారు.


స్థానికంగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి.



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేట అర్బన్,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి, పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరి కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను గ్రామాల్లో గడపగడపకూ తీసుకువెళ్లి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాలీముద్దీన్ అహ్మద్,బొమ్మల యాదగిరి, దాస అంజన్న, వివిధ మండలాల అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్పిటళ్ల స్టాఫ్‌కు వేతనాలు పెంచాలి


డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ మజ్దూర్ సంఘం నాయకులు

సిద్దిపేట అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు హాస్పిటళ్లలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ అనుబంధ ప్రైవేట్ హాస్పిటల్స్ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీలె ఉమేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రైవేటు హాస్పిటళ్లలో పని చేస్తున్న కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవుదినాలు వారికి వర్తింపజేయాలన్నారు. కార్మికుల పక్షాన బీఎంఎస్ పోరాటం కొనసాగిస్తుందన్నారు.

గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో పని చేయాలి

మద్దూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు మేక మల్లేశం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండల పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్ పోటీకి అభ్యర్థుల పేర్ల సేకరణ కోసం నిర్వహించిన సమావేశంలో మండల, గ్రామ నాయకులతో పాటు కార్యకర్తలకు గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేక మల్లేశం మాట్లాడారు. గ్రామశాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసుకుని ఏకతాటిపై ఉండి ఒకే అభ్యర్థి పేరు ఖరారు చేయాలని సూచించారు అంతకు మించి ఉన్నట్లైతే మండల పార్టీ ఆధ్వర్యంలో సమన్వయం చేసి ఒకే అభ్యర్థి పేరు ఖరారు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ముస్త్యాల మనోహర్, గుండెగోని మల్లేశం, బోయిని శ్రీనివాస్, మారెల్ల భాస్కర్‌రెడ్డి, చల్ల లక్ష్మీనర్సింహారెడ్డి , కనకచంద్రంతో పాటు పలువురు గ్రామ మండల నాయకులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను భూమిలోనే కలియదున్నాలి


చిన్నకోడూరు: విఠలాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిద్దిపేట ఏడీఏ పద్మ

చిన్నకోడూరు/వర్గల్/కొమురవెల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరి కోతల తర్వాత మిగిలిన వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. శుక్రవారం చిన్నకోడూరు, వర్గల్, కొమురవెల్లి మండలాల్లో వ్యవసాయ అధికారులు వరి కొయ్యలను కాల్చుతున్న పొలాలను సందర్శించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పించారు. భూమిలోని మిత్ర పురుగులు నశించడంతో పాటు వాయు కాలుష్యం ఏర్పడి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని తెలిపారు. పంట కోసిన తర్వాత మిగిలిన అవశేషాలు మురిగిపోవడానికి సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయాలన్నారు. అనంతరం రొటోవేటర్‌తో కలియదున్నితే పంట అవశేషాలు భూమిలో కలిసిపోయి రసాయన ఎరువుల అవసరం లేకుండా పంటలు పండించవచ్చని వివరించారు. చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గ్రామంలో ఏడీఏ పద్మ, వర్గల్ మండలకేంద్రంలో మండల వ్యవసాయాధికారి శేషశయన, కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ రైతులకు అవగాహన కల్పించారు.

మతసామరస్యానికి ప్రతీక దర్మాజీపేట


దర్మాజీపేటలో సీనియర్లతో ఆత్మీయ సమావేశమైన మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్

దుబ్బాక, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మతసామరస్యతకు ప్రతీక దుబ్బాక మున్సిపల్ దర్మాజీపేట వార్డు అని, గ్రామపంచాయతీగా ఉండే ఆ వార్డులోని ప్రజలు కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉంటారని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో 60ఏళ్లు పైబడిన ఆత్మీయులను పలకరించేందుకు వచ్చారు. గ్రామాల్లో అభివృద్ధికి వారు చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలోని హిందూ, ముస్లిం పండుగలకు కులమతాలకు అతీతంగా ఇతోధిక సహాయం అందించే, సికింద్రాబాద్ డైమండ్‌పాయింట్ హోటల్ యజమాని ఇబ్రహీంను కూడా కలిశారు. దర్మాజీపేట గ్రామానికి చెందిన ఇబ్రహీం రంజాన్ నెలలో పేదలకు జకాత్ ఇవ్వడంతోపాటు, హిందూపండుగలకు, పేదల పెళ్లిలకు మూడు దశాబ్దాలుగా సహాయం అందిస్తున్నారు. ఆయనను కలిసిన మాజీ ఎమ్మెల్సీ గ్రామంలోని ప్రముఖ వృద్ధనాయకుడు ప్రతీప్‌రెడ్డితో పాటు పలువురు నాయకులను కలిసి ఆత్మీయంగా పలకరించారు. అలాగే అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతరెడ్డి పేట గ్రామంలో శుక్రవారం మరణించిన దివంగత నేత, రాష్ట్ర గీత పారిశ్రామిక ఆర్థిక సహకార సంఘం మాజీ చైర్మన్ బండినర్సాగౌడ్ సతీమణి భాగ్యలక్ష్మి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే దుంపలపల్లి వార్డులోని ప్రముఖ విశ్రాంత ఉపాధ్యాయుడు అధికం బాలేశం మాతృమూర్తి సత్తవ్వ (108) శుక్రవారం మరణించారు. శతాధిక వృద్ధురాలు సత్తవ్వ భౌతికదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

పల్లె పల్లెకూ బీఆర్ఎస్

కొండపాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పల్లెపల్లెకూ గులాబీ జెండా కార్యక్రమాన్ని నిర్వహించారు. సిరసనగండ్ల, ఖమ్మంపల్లి, గిరాయిపల్లి గ్రామాల్లో నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని తెలుపుతూ కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు నూనె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో49 మంది వాహనదారుల పట్టివేత

● 47మందికి జరిమానా.. నలుగురికి జైలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్/ములుగు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 49 మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం ఆయా కోర్టుల్లో హాజరుపరచగా న్యాయాధికారులు 47మందికి రూ.4,75,000జరిమానా విధించారు. నిందితుల్లో నలుగురికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల సిద్దిపేట పట్టణంలోని పలు కూడళ్లలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 35 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి వి.తరణి ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం రూ.3,55,000 జరిమానా విధించారు. నిందితుల్లో ఒకరికి 7రోజులు, మరో వ్యక్తికి 3 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

● గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో 12 మంది పట్టుబడ్డారు. వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా నిందితుల్లో 10 మందికి రూ.లక్ష జరిమానా విధించారు. మరో ఇద్దరికి 2 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు.

● ములుగు ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఇద్దరు వాహనదారులు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని గజ్వేల్ కోర్టులో న్యాయాధికారి స్వాతిగౌడ్ ఎదుట హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పదిలో వందశాతం ఫలితాలు సాధించాలి: డీఈవో


గట్లమల్లాల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

నంగునూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టెన్త్ వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొండంరాజుపల్లి, గట్ల మల్యాల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పాఠశాలలో పరిశుభ్రత పాటిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలన్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. డీఈవో వెంట సీఆర్పీ పెంటయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

సర్వీస్‌లో ఉన్నవారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి


బెజ్జంకిలో మాట్లాడుతున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు

బెజ్జంకి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : 2010 కంటే ముందు నియామకమైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బెజ్జంకిలో వారు మాట్లాడారు. ఆర్‌టీఈ చట్టం ఎన్‌సీటీఈ నిబంధనలు మార్చు చేసి నూతనంగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ పరీక్ష నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి రామంచ రవీందర్, మండలశాఖ అధ్యక్షుడు శంకరాచారి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బార్దాన్లు లేక రైతుల ఇబ్బందులు

మద్దూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రంలో బార్దాన్ సంచులు లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని రైతులు రైతులు ఆరోపిస్తున్నారు. వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు వెంటనే బార్దాన్ సంచులు అందించి ఆందోళనకు గురికాకుండా చూడాలని మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మిసాగర్ డిమాండ్ చేశారు.

మోడల్‌స్కూల్ విద్యార్థినులకు అవగాహన

చేర్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ కార్యకలాపాలలో భాగంగా చేర్యాల మండలం ముస్త్యాల మోడల్‌స్కూల్ విద్యార్థినులకు సామాజిక భావోద్వేగ శ్రేయస్సు అంశం పట్ల శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ లావణ్య భరద్వాజ్ పలు అంశాలను వివరించారు. భావోద్వేగాల నియంత్రణతో పాటు మానవసంబంధాలు బలహీన సమయంలో ఒంటరిగా ఉన్న సమయంలో ఎలా బయటపడాలన్న విషయాలను వివరించారు. ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ప్రిన్సిపాల్ భిక్షం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథగా మారిన గజ్వేల్ నియోజకవర్గం: సీపీఐ


గజ్వేల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గం అనాథగా మారిందని సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు భట్టు దయానందరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ పట్టణంలో సీపీఐ నాయకులు స్వర్గం రాజేశంతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించినా గజ్వేల్‌లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదని, పదేళ్లలో గజ్వేల్ ప్రజలకు ఇచ్చిన 5వేల ఇళ్ల హామీ నెరవేరలేదన్నారు. గతంలో తమ పోరాటాలతో పట్టాభూమిని కొనుగోలు చేసి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలను అందజేసిందని, కానీ సదరు స్థలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేవలం 1,250 ఇళ్లను కట్టించి అర్హులకు కేటాయించకుండా తాత్సారం చేసిందని విమర్శించారు. రింగ్‌రోడ్డు ఇంకా పూర్తి కాలేదని, బస్టాండ్‌ల నిర్మాణం పూర్తి కాలేదని, గెస్ట్‌హౌజ్ కూల్చివేసి కొత్తగా నిర్మాణం చేపట్టలేదన్నారు. రేడియల్ రోడ్ల పరిస్థితి సైతం అలాగే ఉందని, ఎడ్యుకేషన్ హబ్‌లలో ఆడిటోరియంలు ఆగిపోయాయని, మల్లన్నసాగర్ పునరావాస కాలనీని పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా గజ్వేల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కోరారు.

ఉత్సవ కమిటీలో గొల్ల, కురుమలకే ప్రాధాన్యం


మల్లన్న ఆలయం వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కొమురవెల్లి,నవంబర్28(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఉత్సవకమిటీ సభ్యులుగా ఇటీవల నియమితులైన సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆలయం వద్ద శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ.. నూతనంగా నియమించిన కమిటీలో గొల్ల, కురుమ సామాజికవర్గాల వారికే అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉత్సవ కమిటీలో ఐదుగురిని సభ్యులుగా నియమించామన్నారు. ఉత్సవ కమిటీలో గంగం నర్సింహారెడ్డిని నియమించడంతో జనగామ నియోజకవర్గానికి చెందిన కురుమ సామాజికవర్గం నేత కంచె రాములు తనకు కమిటీలో చోటు కల్పించలేదనీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై దుర్భాషలాడటం సరికాదన్నారు. ఆయన వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి క్షమాపణ చెప్పాలన్నారు. కంచె రాములుపై త్వరలోనే పీసీసీ అధ్యక్షుడికి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌కు, మంత్రులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ, చేర్యాల వ్యవసాయ కమిటీ చైర్మన్లు శివరాజ్‌యాదవ్, శ్వేత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబాపూలేకు ఘన నివాళి


భూంపల్లిలో మహాత్మాజ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో అంటరానితనాన్ని, కులవివక్షను రూపుమాపేందుకు పోరాటం చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి)


గజ్వేల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు